**కథానిక** చామర్తి దుర్గాప్రసాద్

# మనిషిలో పాము

బుస్సుని లేచి పడగ విసిరింది త్రాచుపాము.

పాముల సూర్యం చేతిని అలవోకగా తప్పించుకొని గర్వంగా చూశాడు. తీగజల్లెడ అవతల నిల్చున్న జనం వేపు.

ఆ పాముకు కోరలు పీకలేదు. ఆ కోరల్లో పరమవిషం ఉంది. విషం తీసిన పామంటే జనానికి ఉత్సాహం ఉండదు గదా!

''బ్రతుకోసం ఎంతకయినా తెగిస్తాడు మనిషి'' అని ఎవరో అన్నారు.

''కాదంటే పాముల సూర్యానికిది ఆట. అతని తండ్రి పేరు మోసిన కోటీశ్వరుడు. ఆయన ఫాక్టరీల్లో సూది మొదలు కారు వరకూ మందులు మొదలు మారణాయుధాల వరకూ తయారవుతాయి. ఎంత చెప్పినా వినిపించ కుండా వచ్చి చేరాడు స్నేక్ పార్కులో'' అన్నాడు వివరాలు తెలిసినాయన.

పాముల సూర్యం త్రాచుపాముని ఉడికిస్తున్నాడు చేత్తో. దానికి కోపం తెప్పిస్తున్నాడు. కాటందుకున్నట్టే అందుకొని తప్పుకుంటున్నాడు.

ఆ రోజు ప్రొద్దుట గూడా తన తండ్రి వాదించాడు ప్రాణాలతో చెలగాటం వద్దని. పాముతోనా స్నేహం? అనీ.

విషం లేదనుకొన్న పాముతో ఆడుకుంటూ ఉంటే, నిజమే అశ్రద్ధ చేయవచ్చు మనిషి. కానీ విషం ఉందని తెలిసిన పాము, విషం లేదని భ్రమలో ఉన్న పాము కన్నా వెయ్యిరెట్లు నయం కదూ. అసలు పాము మనిషికన్నా ఎంతో మంచిది. పాముల సూర్యానికి పామంటే ప్రాణం.

౧

పంచదార డబ్బాలో ఉప్పుపోసి తల్లిని ఉడికించడం సూర్యానికి చిన్నప్పటి సరదా. పంచదార బదులు ఉప్పువేసి తల్లి తండ్రికి ఫిర్యాదు చేసినప్పుడు తన తండ్రి అదెంత నేరమో చెప్పేవాడు. ఆ పాముకి విషం ఉందని తెలియడం ఉప్పు డబ్బాలో ఉప్పే ఉంది అని నమ్మకం ఉండడం లాంటిది. ఇంక భయం ఎందుకు?

ఆలోచనలో ఉన్న సూర్యం ఏమరుపాటులో ఏమయిందో దభాల్ని నేలమీద పడ్డాడు. తన ప్రాణమయిన పాము కాటేసిందా? నోట్లోంచి నురుగులు రాగా, అతను వాచి పొయ్యాడు.

తలుపుతీసి లోపలికి రావటానికి ప్రతివాడికే భయమే - పాము లోపలే ఉందాయె.

పాము కాసేపు చూసింది, సూర్యాన్ని నాకింది. ఆ తర్వాత విచారంతో తలవంచుకున్నట్లు జనానికి దూరంగా మరోవైపు పోయి నేలమీద పడగ వాల్చి పడుకొంది. జనాన్ని రమ్మని. భయం లేదన్నట్లుగా.

ఆ క్షణంలో సాహసం చేసి ఎవరో సూర్యాన్ని అవతలికి లాగారు. వెంటనే ఆస్పత్రికి చేర్చారు

డాక్టరు పరీక్షగా చూశాడు. పాము గాట్లు లేవు. భయం—అంతే. పాముల సూర్యానికి భయమా! ఎవరు చెప్పగలరు ఎప్పుడు భయం వస్తుందో! నిస్త్రాణగా ఉన్న సూర్యానికి డాక్టరు ఇంజక్షన్ ఇచ్చాడు.

కోలుకొంటున్న సూర్యం పరిస్థితి మరు క్షణంలో విషమించింది. డాక్టరుకి ఏం చెయ్యాలో తోచలేదు. ఏమందు ఇవ్వాలో తోచలేదు.

పంచదార డబ్బాలో ఉప్పు! ఏ మందులో ఏ మారణాయుధం ఉందో, అవి తయారు చేసేవాళ్ళకే తెలియాలి.